నేడు యధావిధిగా 'స్పందన'

ప్రజాశక్తి - ఏలూరు
స్థానిక జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఈ నెల 27వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి 'స్పందన' కార్యక్రమం యధావిధిగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోనూ స్పందన కార్యక్రమం యధావిధిగా సాగుతుందని పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి భౌతిక దూరం పాటించాలని కోరారు.

పంట నష్టం తేల్చండి..!

అకాల వర్షాలకు పొగాకు, మొక్కజొన్న, మామిడి, నిమ్మ, అరటి పంటలకు తీవ్ర నష్టం
ఇప్పటికీ ప్రాథమిక అంచనాలతోనే సరి
దెబ్బతిన్న పంటల లెక్కలపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి
నష్టం అంచనా పూర్తి ఎప్పటికో

ఇటీవల కురిసిన వర్షానికి ఉంగుటూరు మండలంలో నేలకొరిగిన మొక్కజొన్న పంట

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి
అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈదురుగాలులు, వడగళ్ళ వాన రైతులను అతలాకుతలం చేసింది. పామాయిల్, నిమ్మ చెట్లు వేళ్లతో సహ కూలిపోయిన పరిస్థితి నెలకొంది. పొగాకు, మొక్కజొన్న, మామిడి, నిమ్మ అరటి, కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టిన రైతులు లబోదిబోమంటున్నారు. దెబ్బతిన్న పంటలకు సంబంధించి అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. ఎన్యుమరేషన్ పూర్తి చేసి రైతులకు త్వరితగతిన పరిహారం అందించాల్సి ఉన్నప్పటికీ మందకొడిగా సాగుతుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. అధికారులు చెబుతున్న ప్రాథమిక అంచనాలపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సాగు చేసిన పంటలో 33 శాతం దెబ్బతింటేనే నష్టం జాబితాలో చేరుస్తామంటున్నారని, దీంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారనుందని రైతులు చెప్పుకొస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం నిమ్మ, పామాయిల్, అరటి వంటి ఉద్యాన పంటలు జిల్లాలో 320 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశారు. సాధారణ పంటలకు వచ్చేసరికి పొగాకు, మినుము, వరి, వేరుశనగ, మిర్చి వంటి పంటలు 955 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు చెప్పుకొస్తున్నారు. అకాల వర్షాలకు పెద్దఎత్తున దెబ్బతిన్న పంటల్లో పొగాకు అత్యధికంగా ఉంది. అధికారుల లెక్కల ప్రకారం 497 ఎకరాల్లో పొగాకు దెబ్బతిన్నట్లు చెబుతుండగా ఒక్క జీలుగుమిల్లి మండలంలోనే పొగాకు పంట నష్టం పెద్దఎత్తున ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ మండలంలో వడగళ్ల వానకు ఒక్క గ్రామంలోనే 150 ఎకరాలకుపైగా పొగాకు పంట దెబ్బతిన్నట్లు రైతులు చెబుతున్నారు. మెట్ట ప్రాంతంలో పొగాకు పంట వేలాది ఎకరాల్లో సాగైంది. పంటనష్టం పెద్దఎత్తున జరిగినట్లు రైతులు చెబుతున్నారు అధికారుల లెక్కలు మాత్రం నామమాత్రంగా ఉన్నాయి. 33 శాతం నిబంధన పేరిట దెబ్బతిన్న పొలాలను సైతం లెక్కల నుంచి పక్కన పెడుతున్నట్లు తెలుస్తోంది. నిమ్మచెట్లు ఈదురుగాలులకు వేళ్లతో సహాలేచి కుప్పకూలాయి. పెద్దఎత్తున కూలిన తోటలను లెక్కల్లోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పంటనష్టం అంచనాలకు సంబంధించి పూర్తిస్థాయిలో జరగాల్సి ఉంది. పంట నష్టం నమోదు ప్రక్రియ ప్రారంభించినట్లు చెబుతున్నా చురుగ్గా సాగుతున్న దాఖలాల్లేవు. పంటనష్టం అంచనాలపై నిబంధనలు సడలించి రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. మొక్కజొన్న రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని అంతా లబోదిబోమంటున్నారు. పంట నష్టం అంచనాలన్నీ గోల్‌మాల్‌గా ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంటనష్టం ప్రాథమిక అంచనాలపై వ్యవసాయాధికారులు కనీసంగా ప్రకటన చేయని పరిస్థితి జిల్లాలో నెలకొంది. పంటనష్టంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే చర్చ రైతుల్లో సాగుతోంది. దెబ్బతిన్న పంటలు లెక్కించి పరిహారం త్వరితగతిన అందించేలా చూడాలని రైతులు కోరుతున్నారు. పంటనష్టానికి ఇచ్చే పరిహారంపైనా రైతుల్లో తీవ్ర చర్చ సాగుతోంది. పెట్టుబడులు తక్కువగా ఉన్న కాలంలో చేపట్టిన లెక్కల ప్రకారం పరిహారం ఇస్తుండటంపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. పెట్టుబడులు భారీగా పెరిగిన నేపథ్యంలో పంట నష్టపరిహారం సైతం పెంచాలని రైతులు కోరుతున్నారు.

నిబంధనలు సడలించి రైతులకు న్యాయం చేయాలి
కె.శ్రీనివాస్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి
అకాల వర్షం, వడగళ్ళ వానలకు తీవ్ర పంట నష్టం వాటిల్లింది. నిబంధనల పేరుతో నష్టం అంచనాలను తక్కువ చేసి చూపిస్తున్నారు. ఉద్యాన, ఆహార పంటలు పెద్దఎత్తున దెబ్బతిన్నాయి. పంటనష్టం అంచనాల్లో 33 శాతం నిబంధనను సడలించి పంటనష్టం నమోదు చేయాలి. ఎంతమేర పంటనష్టం జరిగితే అదేవిధంగా నష్టం నమోదు జరగాలి. వెంటనే ఎన్యుమరేషన్ పూర్తిచేసి పరిహారం అందించి రైతులను ఆదుకోవాలి.

బిజెపి పాలనలో ఆదివాసీలపై పెరిగిన దాడులు

ఎపి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర - ఘనంగా ప్రారంభమైన జిల్లా మహాసభ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి
కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పాలనలో దేశవ్యాప్తంగా ఆదివాసులపై దాడులు పెరిగాయని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర అన్నారు. ఆదివారం గిరిజన సంఘం ఏడో జిల్లా మహాసభ మండల కేంద్రమైన జీలుగుమిల్లిలో అమరజీవి కుంజా బొజ్జి, సున్నం రాజయ్య ప్రాంగణంలో ప్రారంభమైంది. మహాసభ ప్రారంభ సూచకంగా సంఘ పతాకాన్ని జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం దుర్గారావు ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల కాలంలో మృతి చెందిన నేతలకు సంతాపం తెలిపారు. అనంతరం ప్రారంభమైన ప్రతినిధుల సభలో కిల్లో సురేంద్ర ప్రారంభోపన్యాసం చేస్తూ తొమ్మిదేళ్ల బిజెపి పాలనలో అన్ని రాష్ట్రాల్లో గిరిజనులపై దాడులు పెరిగాయన్నారు. గిరిజనులకు అత్యున్నత రాష్ట్రపతి పదవి కట్టబెట్టి కిందిస్థాయిలో నిత్యం ఆదివాసీలపై దాడులకు పాల్పడటం బిజెపి కపట నీతిని బట్టబయలు చేస్తుందన్నారు. ఇటీవల జాతీయ అటవీ చట్టాన్ని, నూతన అటవీ సంరక్షణ చట్టాన్ని తీసుకొచ్చిందని, తద్వారా గిరిజనులకు అడవిపై హక్కు లేకుండా చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తరతరాలుగా అడవిలో జీవించి అడవిని నమ్ముకున్న ఆదివాసులకు హక్కు పట్టాలు ఇవ్వలేని ప్రభుత్వం అటవీ హక్కుల చట్టాన్ని సవరణ చేయడం ద్వారా ప్రయివేట్, కార్పొరేట్, బడా వ్యక్తులకు అటవీ భూములను అప్పగించే ప్రయత్నం చేస్తుందన్నారు. పీసా, ఆర్ఒఎఫ్ఆర్ గ్రామసభలు నిర్వహించకుండా ప్రయివేట్ వ్యక్తులకు భూములను కట్టబెట్టేలా ప్రభుత్వం సవరణ చేయడం దుర్మార్గపు చర్యని అభివర్ణించారు. అడవులను ప్రయివేట్, బడా కార్పొరేట్ వ్యక్తులకు కేటాయిస్తే 10 కోట్ల మంది ఆదివాసులు అన్యాయమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. సహజ వనరులను, అడవులు, ఖనిజ నిక్షేపాలను కొల్లగొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతుందన్నారు. గిరిజనుల హక్కులను ఒకొక్కటిగా కుదిస్తూ వారి హక్కులను కాలరాస్తూ బిజెపి ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రకంగా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. విభజన హామీల్లో భాగంగా గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకే పరిమితమైందని విమర్శించారు. తక్షణమే గిరిజన యూనివర్సిటీ భవనాల నిర్మాణం ప్రారంభించాలన్నారు. జిఒ నెం.3ని కరోనా కాలంలో సుప్రీంకోర్టు కొట్టివేసిందని, రాష్ట్ర ప్రభుత్వం పిటీషన్ వేసినా సక్రమంగా వాదించకపోవడం వల్ల గిరిజనులు తమ ఉద్యోగాలు పొందే హక్కులను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గిరిజనేతరులు 1/70 పరిధిలో తమ హక్కులకు భంగం కలుగుతుందంటూ సుప్రీంకోర్టులో పిటీషన్ వేస్తే ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని ఆయన ప్రశ్నించారు. తక్షణమే సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం రిట్ పిటీషన్ వేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం ఇప్పటికే రిట్ పిటీషన్ సుప్రీం కోర్టులో వేసిందని ఆయన గుర్తు చేశారు. అభివృద్ధి చెందిన బోయ వాల్మీకులను గిరిజన జాబితాలో కలపడం రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గపు చర్యని అన్నారు. ఏకసభ్య కమిషన్ శ్యామల ఆనంద్‌కుమార్ నివేదికను బహిర్గతం చేయాలని సురేంద్ర డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన, ప్రజాసంఘాల అభిప్రాయాలను స్వీకరించకుండా ప్రభుత్వ విధానాన్ని ఏకపక్షంగా ప్రకటించడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలో 28 లక్షల గిరిజనులు ఉండగా బోయ వాల్మీకులు 40 లక్షల మంది ఉన్నారని, బోయ వాల్మీకులకు ఎటువంటి భాష, సంప్రదాయ ఆచారాలు లేవని, గిరిజన తెగల జీవనం, అటవీ ఉత్పత్తుల సేకరణ వారికి లేవని తెలిపారు. గతంలో అనేక కమిషన్లు బోయ వాల్మీకులకు గిరిజన తెగల అర్హత లేదని ప్రకటిస్తే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఏకపక్ష నిర్ణయాలతో ఓట్లు కోసమే గిరిజన తెగల్లో చేర్చేందుకు ప్రతిపాదిస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి చెందిన నాన్‌ఏజెన్సీ గిరిజనేతరులను గిరిజనుల జాబితాలో కలపడం ద్వారా అన్ని హక్కులూ అభివృద్ధి చెందిన బోయ వాల్మీకుల హస్తంగతమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం గిరిజన జాబితాలో చేర్చే అసెంబ్లీ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి గిరిజన సంఘం పిలుపునిస్తుందన్నారు. మహాసభలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్ కార్యకలాపాల నివేదిక ప్రవేశపెట్టారు. ఈ మహాసభలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి పాల్గొన్నారు. మహాసభకు అధ్యక్షవర్గంగా తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరరావు, సుంద్రు బుల్లెమ్మ, తెల్లం దుర్గారావు, గంగమ్మ వ్యవహరించారు.


గిరిజన జెండాను ఆవిష్కరిస్తున్న తెల్లం దుర్గారావు



మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర

బిజెపి విధానాలు దేశ భవిష్యత్తుకు ప్రమాదం

కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు
5న చలో ఢిల్లీ ప్రచార యాత్ర ప్రారంభం

ఏలూరులో జాతాను ప్రారంభిస్తున్న సోమయ్య

ప్రజాశక్తి - ఏలూరు
కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ, మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ పేరిట లక్షలాది మందితో చేపట్టనున్న కార్మిక, కర్షక ఐక్యతా ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ జిల్లా ప్రచారయాత్రను ఆదివారం స్థానికంగా ప్రారంభించారు. సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతుసంఘం, కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ప్రచార యాత్రను స్థానిక ఓవర్ బ్రిడ్జి సెంటర్లో బి.సోమయ్య జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నగరంలో పలు ప్రాంతాల్లో ప్రచార యాత్ర సాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాధనాన్ని పెట్టుబడిదారులు, కార్పొరేట్లు దోచుకుంటున్నారన్నారు. ప్రజలపై ఎక్కువ పన్నులు మోపడంతో మధ్యతరగతి, సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు రక్షణగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. కౌలు రైతులకు రక్షణ లేదన్నారు. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలపై దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, రాష్ట్రాల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించి వేస్తోందన్నారు. కేంద్రం విధానాలతో రాజ్యాంగం పెను ప్రమాదంలో పడిందని, యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని చెప్పారు. ఈ విధానాలను తిప్పికొట్టకపోతే దేశ సంపద అంతా అదానీ, అంబానీల చేతుల్లోకి వెళ్లిపోతుందన్నారు. కార్యక్రమంలో ఆర్.లింగరాజు, కె.విజయలక్ష్మి, వి.సాయిబాబా, జె.గోపీ, కోటేశ్వరరావు, మాధవ పాల్గొన్నారు.

పెదపాడు: చలోఢిల్లీ జయప్రదానికి ఆదివారం మండలంలోని కొత్తూరు, కొత్త ముప్పరు, పెదపాడు, నాయుడుగూడెం, సత్యవోలు, కొణికి గ్రామాల మీదుగా ప్రచార యాత్ర సాగింది. పెదపాడు సెంటర్‌లో నిర్వహించిన సభలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రైతుల పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని, ఉపాధి హామీ కింద సంవత్సరానికి 200 రోజులు పనులు కల్పించి రోజుకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకష్ణ, శ్రామిక మహిళ జిల్లా నాయకురాలు కె.విజయలక్ష్మి, ఆవాజ్ జిల్లా నాయకులు షేక్ కరీముల్లా పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: వచ్చే నెల ఐదో తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో చలో ఢిల్లీ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. రవి మాట్లాడుతూ ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి రాంబాబు, సిఐటియు నాయకులు సూర్యారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్, నేతలు బి.సుబ్బారావు, రామచంద్రం, నారాయణ, ఆశీర్వాదం, రెడ్డి పాల్గొన్నారు.

మండవల్లి: మోడీ అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాల వల్ల సామాన్యుల జీవితాలు కష్టాల పాలవుతున్నాయని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు విమర్శించారు. చలోఢిల్లీ ప్రచార జాతా ఆదివారం మండవల్లి చేరుకుంది. కార్యక్రమంలో జాతా నేతలు కె.శ్రీనివాస్, పిల్లి రామకృష్ణ, కె.విజయలక్ష్మితోపాటు స్థానిక నేతలు చిన్న మాధవరావు, చల్లాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: చలో ఢిల్లీ జీపుజాతా ఆదివారం కైకలూరు చేరింది. స్థానిక తాలూకా సెంటర్‌లో జరిగిన సభలో నేతలు కె.శ్రీనివాస్, ఆర్.లింగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకుడు లాజర్ పాల్గొన్నారు.

కలిదిండి: చలో ఢిల్లీ ప్రచార యాత్ర మండలంలోని కోరుకొల్లు, సానారుద్రవరం, పడమటిపాలెం, కలిదిండి, వెంకటాపురం, ఆరుతెగలపాడు గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా పలుచోట్ల నేతలు మాట్లాడారు. కార్యక్రమంలో జాతా నేతలతోపాటు స్థానిక ప్రజా సంఘాల నాయకులు ఎస్.మహంకాళరావు, ముంగం సురేష్, జక్కుల మహేష్, చిన్నం శ్రీకాంత్, వీరవల్లి భాస్కరరావు, పాతపాటి జ్ఞానేషు, పెరుమాళ్ల సత్యనారాయణ, చిప్పాడ రమేష్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : చలో ఢిల్లీని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు కె.విజయలక్ష్మి పిలుపునిచ్చారు. ఏలూరులో ప్రారంభమైన యాత్ర ఆదివారం సాయంత్రానికి ముదినేపల్లికి చేరింది.

4వ రోజు కొనసాగిన దళితుల భూపోరాటం

రిలే దీక్షల్లో 5న చలో ఢిల్లీ పోస్టర్ల ఆవిష్కరణ

చలో ఢిల్లీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - దెందులూరు
రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ పిలుపునిచ్చారు. దోసపాడు గ్రామంలో చేపట్టిన భూపోరాటం ఆదివారం నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ప్రజా సంపదనంతా పెట్టుబడిదారులు, కార్పొరేట్లు దోచుకుంటున్నారని విమర్శించారు. వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి రైతులను బిచ్చగాళ్లుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతులకు రక్షణ లేదన్నారు. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలపై దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, రాష్ట్రాల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించి వేస్తోందని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షకులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. చలో ఢిల్లీ విజయవంతం కోరుతూ దశలవారీగా ఇంటింటా ప్రచారం, జాతాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పి.ఆనందరావు, డి.నాగేంద్ర, మణి, గంగాధర్, కుమారి, లలిత, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఈ నిర్బంధం ఇంకెన్నాళ్లు..!

ప్రపంచంలోనే అత్యంత బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థ గల దేశంగా మన దేశానికి పేరుంది. అయితే అది ఒకప్పటి మాటగా మారిందా అంటే అవుననే సమాధానం వస్తోంది. నేడు అడుగు తీసి అడుగేస్తే నిర్బంధం, సమస్యలపై నినదిస్తే దేశద్రోహం అనే విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దగ్గర నుంచి రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం వరకూ ఒకే రీతిన వ్యవహరిస్తున్నాయి.

ఇటీవల తమ సమస్యల పరిష్కారానికి అంగన్వాడీలు చలో విజయవాడకు పిలుపునిచ్చారు. ప్రధానంగా సిఎం జగన్ తన పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలనేది వారి ప్రధాన డిమాండ్. నవరత్నాల పేరుతో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వ పెద్దలు జగన్ ఇచ్చిన హామీల గురించి మాత్రం మాట్లాడకపోవడం అందరినీ విస్మయపరుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇప్పటికైనా తమకిచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీలు చలో విజయవాడ చేపట్టారు. అయితే వారిపై ప్రభుత్వం పోలీసుల ద్వారా ప్రయోగించిన నిర్బంధం అందరినీ నివ్వెరపోయేలా చేసింది. ఏలూరు సమీపంలో కలపర్రు టోల్‌గేట్ వద్ద పహారా కాసిన పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టి అర్ధరాత్రి సమయం నుంచి అరెస్టులపర్వానికి తెరతీశారు. ఆపై వారిని పెదపాడు, ఏలూరు రూరల్ పోలీసు స్టేషన్లకు తరలించారు. అయితే కనీసం మహిళలని చూడకపోవడం, అర్ధరాత్రి అరెస్టు చేస్తున్నామనే స్పృహ లేకుండా స్టేషన్‌కు తరలించాక కనీసం మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు లేనిచోట నిర్బంధించడం ఈ ప్రభుత్వ తీరును చెప్పకనే చెబుతోంది. తమ డిమాండ్లపై నినదించాలా.. ప్రభుత్వ తీరును నిరసిస్తూ సౌకర్యాల గురించి నినదించాలా అనే డోలాయమాన పరిస్థితిని సృష్టించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కిందనే చెప్పొచ్చు. గ్రామాల్లో మహిళల హక్కుల పరిరక్షణకు, భద్రత కోసమే నియమించినట్లు చెప్పిన సచివాలయ మహిళా పోలీసులను ఆ మహిళల హక్కులనే హరించేలా అంగన్‌వాడీల నిర్బంధానికి ఉపయోగించిన తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది. అయినా మొక్కవోని ధైర్యంతో అంగన్‌వాడీలు ఎక్కడికక్కడ ఆందోళనలు చేపట్టడంతో జిల్లాలోని పోలీసు స్టేషన్లు నినాదాలతో మార్మోగాయి.

అదే తరహా నిర్బంధం కొనసాగుతున్న

వేళ మరుసటి రోజు ఆశాలు తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ రెండు జిల్లాల్లో కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయాల వద్ద కదంతొక్కారు. పశ్చిమగోదావరి జిల్లాలోని ఆశాలంతా భీమవరంలోని కలెక్టరేట్ వద్దకు చేరుకుని నినదించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారుల తీరు చర్చనీయాంశమైంది. తమ శాఖ పరిధిలోని వందలాది మంది ఆశాలు మండుటెండలో రోడ్డెక్కినా స్పందించకపోవడం ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యాన్నే ఆ శాఖ జిల్లా ఉన్నతాధికారులు ప్రదర్శించారనే వ్యాఖ్యానాలు విన్పించాయి. పోలీసుల జోక్యంతో దిగొచ్చిన అదనపు డిఎంహెచ్ఒ వినతిపత్రం తీసుకుని కొన్ని హామీలైతే ఇచ్చారు. ఇది కచ్చి తంగా ఆశాల విజయంగానే చెప్పుకోవాలి. అదే సమయంలో ఆ హామీలు అమలు చేయకపోతే కచ్చితంగా పోరాటం ఉధృతం చేస్తామని నేతలు అక్కడే స్పష్టం చేయడం వారి సమస్యల తీవ్రతను ప్రతిబింబిస్తోంది. మొత్తంగా చూస్తే అటు అంగన్‌వాడీలు, ఇటు ఆశాలు వారి సమస్యలపై గళమెత్తితే వారి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయకుండా కనీసం మహిళలనే కనికరం లేకుండా ప్రభుత్వం నిర్బంధానికి పాల్పడటం, అదే తీరులో ఆ నిర్బంధాన్ని వారు ప్రతిఘటించడం భవిష్యత్తు పోరాటాలకు స్ఫూర్తిదాయమనే చెప్పొచ్చు.

ఇక సిఎం జగన్ శనివారం దెందులూరు వచ్చి వైఎస్ఆర్ ఆసరా మూడో విడత నిధులను విడుదల చేశారు. ఆయన నేరుగా హెలీకాప్టర్‌లో దెందులూరు వచ్చి మళ్లీ అక్కడ నుంచి అదే హెలీకాప్టర్‌లో తాడేపల్లి వెళ్లిపోయారు. ఎక్కడ సిఎం జగన్‌ను అడ్డుకునే అవకాశమే లేదు. అయినా సరే ప్రభుత్వ పెద్దలకు అభద్రతా భయమో.. లేక పోలీసు అధికారుల అత్యుత్సాహమోగానీ జిల్లా కేంద్రమైన ఏలూరు నుంచి నూజివీడు తదితర ప్రాంతాల నేతలకు ముందస్తు నోటీసులివ్వడం, ఆపై గృహనిర్బంధాలు చేయడం గమనార్హం. పైగా ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగిన ఎన్నికల్లో గెలిచి బాధ్యతల్లో ఉన్న ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీని సైతం గృహనిర్బంధం చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. పైగా పక్కనే పశ్చిమగోదావరి జిల్లాలోని నేతలకు సైతం ముందస్తు నోటీసులివ్వడం, గృహనిర్బంధాలకు ప్రయత్నించడం గమనార్హం. ఈ గృహనిర్బంధాల ద్వారా ప్రభుత్వం ఏం సాధించిందంటే అపఖ్యాతి మూట్టగట్టుకోవడం తప్ప ప్రత్యేకంగా పొందిన లాభమేమీ లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, ఇటు ఉన్నతాధికారులు ఆలోచించి ఈ నిర్బంధపు విధానాలను విడనాడకపోతే కచ్చితంగా రానున్న రోజుల్లో ప్రభుత్వానికి నష్టం తప్పదని రాజకీయ పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

-వివిఎస్‌వి.ప్రసాద్

సిపిఎం సానుభూతిపరులు సీతారామయ్య మృతి

పార్టీ ప్రముఖుల సంతాపం

ప్రజాశక్తి - ఏలూరు
స్వాతంత్ర్య సమరయోధులు అన్నే వెంకటేశ్వరరావు, అనసూయమ్మల అల్లుడు, సిపిఎం సానుభూతిపరులు కిలారి సీతారామయ్య(83) మృతిచెందారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయనను చికిత్స నిమిత్తం ఏలూరు ఆయుష్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం అర్ధరాత్రి తుది శ్వాస విడిచారు. ఆయన మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం సంతాపం తెలిపారు. వీరు ఆదివారం ఉదయం శాంతినగర్‌లోని కిలారి స్వగృహంలో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నే వెంకటేశ్వరరావు, అనసూయమ్మ స్వాతంత్ర్య సమరయోధులే కాకుండా, స్వాతంత్ర్యం అనంతరం దేశంలో పీడిత ప్రజానీకం కోసం పోరాడుతున్న సిపిఎంలో తుదిశ్వాస వరకూ పనిచేశారని గుర్తు చేశారు. అన్నే దంపతులు కమ్యూనిస్టు ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా వారి కుటుంబ సభ్యులను సిపిఎం సభ్యులుగా, సానుభూతిపరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. అన్నే దంపతుల ఏకైక కుమార్తె కల్పన పార్టీ సభ్యురాలిగా ఉండగా, ఆమె భర్త కిలారి సీతారామయ్య సిపిఎం గట్టి సానుభూతిపరులని తెలిపారు. సీతారామయ్య ఎప్పటికప్పుడు దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయాలు, ప్రభుత్వ విధానాలు, ప్రజా సమస్యలపై చేపట్టిన కమ్యూనిస్టు ఉద్యమాలను అధ్యయనం చేస్తూ ఉండేవారన్నారు. ఆయనను కలిసిన నాయకులతో చర్చిస్తూ ఉండేవారని తెలిపారు. సీతారామయ్య స్వస్థలం కృష్ణా జిల్లా అని, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ప్రభుత్వ సహకార సుగర్ ఫ్యాక్టరీల్లో ఇంజినీర్‌గా ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించారని తెలిపారు. ఉద్యోగ విరమణ అనంతరం ఏలూరులో స్థిరపడ్డారన్నారు. సీతారామయ్య చివరలో అనారోగ్యానికి గురై శరీరం సహకరించకున్నా, అవకాశం ఉన్న పలు సేవాకార్యక్రమాల్లో పాల్గొనేవారని తెలిపారు. సీతారామయ్య కుటుంబ సభ్యులు పార్టీకి, ప్రజాసంఘాలకు, పలు కార్యక్రమాలకు వివిధ రూపాల్లో సహాయ, సహకారాలు అందిస్తున్నారన్నారు. అన్నే దంపతుల కుటుంబ సభ్యులందరూ సిపిఎంకు సానుభూతిపరులుగా ఉంటూ అండదండలు అందిస్తూ వస్తున్నారని తెలిపారు. సీతారామయ్య మృతికి సంతాపం, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సీతారామయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో సిపిఎం రాష్ట్ర నాయకులు కె.స్వరూపారాణి, ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు బి సోమయ్య, కె.శ్రీనివాస్, పివి.రామకృష్ణ, నాయకులు కొర్రి విజయలక్ష్మి, ఎం.శ్రీనివాస్, గారపాటి విమల, సురేష్, సాయిబాబు, జగన్నాథరావు, సత్యనారాయణ, గొట్టాపు మురళీ, పలువురు జిల్లా, నగర నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఐద్వా ఏలూరు జిల్లా నాయకులు హైమావతి, సిహెచ్.రాజ్యలక్ష్మి సంతాపం తెలిపారు

సీతారామయ్య (ఫైల్‌ఫొటో)

పశ్చిమ జిల్లా నేతల సంతాపం
సీతారామయ్య మృతికి పశ్చిమగోదావరి జిల్లా నేతలు ప్రగాఢ సంతాపం తెలిపారు. ముఖ్యంగా సిపిఎం సీనియర్ నేత ఆర్.సత్యనారాయణరాజు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు చింతకాయల బాబూరావు, జిల్లా నాయకులు కె.రాజారామ్మోహన్‌రాయ్, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.పద్మజ, పి.పూర్ణ సంతాపం తెలిపారు.

104 - వాహనాల మంజూరు

ప్రజాశక్తి - ఏలూరు

'ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్' కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువచేసే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఏలూరు జిల్లాకు ప్రస్తుతం అదనంగా ఉన్న 28, 104వాహనాలకు అదనంగా మరో 16 వాహనాలను మంజూరుచేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఆశ, 104 జిల్లా మేనేజర్ విలియం చంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదనంగా మంజూరు చేసిన 16 104-వాహనాలతో కలిపి మొత్తం ఏలూరు జిల్లాలో 44 వాహనాలు అన్ని గ్రామ సచివాలయాల్లోనూ, మారుమూల గ్రామాల ప్రజలకు ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లి ఆరోగ్య పరిరక్షణను వారి ఇంటివద్దనే అందించే అవకాశం కల్పిస్తున్నారని తెలిపారు. అదనంగా మంజూరైన 16 వాహనాలను ఏలూరు ఇండోర్ స్టేడియం నుండి ఈనెల 27న కలెక్టరు ప్రసన్న వెంకటేష్ లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు.

భూ యజమాని ప్రమేయం లేకుండా
కౌలుగుర్తింపు కార్డులు ఇవ్వాలి

ప్రజాశక్తి - చింతలపూడి

భూ యజమాని ప్రమేయం లేకుండానే కౌలురైతులకు కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయాలని ఏపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవి.ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చింతలపూడి ఏరియా కౌలురైతు సంఘం మహాసభ సిపిఎం కార్యాలయంలో ఎస్.కె.కాలేషా అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముందుగా రైతు సంఘం జెండాను సంఘం నేత రాజా ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రసాద్ మాట్లాడుతూ సొంత భూమిలేని కౌలు రైతులందరికీ రైతు భరోసా ఎకరాకు రూ.పదివేలు అందించాలన్నారు. కౌలు రైతుల స్వీయ ధృవీకరణతో ఆర్‌బికె అధికారులు నిర్ధారించి ఇ-క్రాప్ నమోదు చేసి ఉచిత పంటల బీమా నష్టపరిహారం అందించాలని కోరారు. ఏపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ 55 సంవత్సరాలు పైబడిన ప్రతీ కౌలురైతుకు నెలకు రూ.ఐదువేలు పింఛను ఇవ్వాలని, కౌలురేట్లు నిర్ణయించేందుకు కౌలు ధరలు నియంత్రణ చట్టం తీసుకురావాలని కోరారు. ఈ మహాసభలో రైతు సంఘం నాయకులు దంతా కృష్ణ, సిపిఎం మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, ఎఐటియుసి ఏరియా అధ్యక్షులు టి.బాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బోడ వజ్రం, కౌలు రైతుల సంఘం హనుమంతరావు, రావెళ్ల రాజేశ్వరరావు, శంకు సత్యనారాయణ, మంగళగిరి నాగేశ్వరావు, జిల్లెళ్ల తులసీరావు, శేఖర్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ జలకళలో 28 బోర్లు మంజూరు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని సిద్ధార్ నగర్, లైన్ తండా, సుంకొల్లు, యనమదల పరిసర గ్రామాల పరిధిలోని చిన్న సన్నకార రైతులకు వైఎస్ఆర్ జలకళలో భాగంగా 28 బోర్లు మంజూరయ్యాయి. ఈ బోర్ల భూముల్లో పంటలు వేస్తున్నారు. అలాగే విద్యుత్ సదుపాయం, విద్యుత్ మోటార్లను ప్రభుత్వమే రైతులకు అందజేయనుంది.

ఎస్సి జాబితాల్లో చేర్చడం పట్ల హర్షం

ప్రజాశక్తి - భీమడోలు

దళిత క్రిస్టియన్లను ఎస్సి జాబితాలో చేర్చుతూ శాసనసభలో తీర్మానం చేయడం పట్ల కెవిపిఎస్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు కెవిపిఎస్ భీమడోలు మండల కన్వీనర్ సుమన్‌బాబు ఆదివారం గుండుగొలనులో మాట్లాడుతూ మతంతో ప్రమేయం లేకుండా దళితులందరినీ ఎస్సీలుగా గుర్తించాలని కెవిపిఎస్ గతంలోనే డిమాండ్ చేసిందన్నారు. దీనిని బిజెపి వ్యతిరేకించడం సరికాదన్నారు. మత ప్రాతిపదికన దేశాన్ని విభజించే ఏ చర్య అయినా దేశాన్ని బలహీనపరుస్తుందన్నారు.

చాట్రాయి: సిఎం జగన్ అసెంబ్లీ సమావేశంలో దళిత క్రిస్టియన్ల పట్ల మంచి నిర్ణయం తీసుకున్నారని చిత్తపూర్ గ్రామ సర్పంచ్ తిరువీధి రమేష్ హర్షం వ్యక్తం చేశారు. దళిత క్రిస్టియన్లను ఎస్సి జాబితాలో చేర్చాలని అసెంబ్లీ సమావేశంలో సిఎం జగన్ తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం సంతోషదాయకమన్నారు. ఎన్నో సంవత్సరాలుగా రాష్ట్రాన్ని పరిపాలించిన నాయకులు దళిత క్రిస్టియన్లను పట్టించుకోకుండా వదిలేశారని, కానీ నేడు జగన్ వారికి న్యాయం చేస్తున్నారన్నారు.



చెక్కు అందిస్తున్న ఎంఎల్ఏలు

దేదీప్య వైద్యానికి సాయం

ప్రజాశక్తి - ఉంగుటూరు

అక్కుపల్లిగోకవరం గ్రామ శివారు గోపరాజుపాడుకు చెందిన కుప్పల దేదీప్య పుట్టుకతోనే లివర్ సమస్యతో బాధపడుతుంది. ఈ వ్యాధికి వైద్యం ఖర్చుతో కూడుకుంది. దీంతో పాపకు వైద్యం చేయించడం వారికి భారంగా మారింది. ఎన్ని ఆసుపత్రులకు తిప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ క్రమంలో హాస్పిటల్ వారు ఖర్చును అంచనా తయారు చేసి కొటేషన్ ఇచ్చారు. అసరా మూడో విడత ప్రారంభానికి దెందులూరు వచ్చిన సిఎం జగన్ వద్దకు పాపను తీసుకుని తల్లిదండ్రులు వెళ్ళారు. స్పందించిన జగన్ తక్షణ సాయంగా రూ.లక్ష అందించాలని, తదుపరి వైద్యానికి ఎంత ఖర్చయినా ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. వైద్యానికి వెంటనే ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ మేరకు రూ.లక్ష చెక్కును కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు అందించారు. సర్పంచి సత్యవతి, సొసైటీ ఛైర్‌పర్సన్ బాబ్జీ, జెడ్‌పిటిసి సభ్యులు జయలక్ష్మి, ఎంపిపి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న వార్డెన్

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి, భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ముసునూరు సంక్షేమ హాస్టల్ వార్డెన్ షేక్ నజిర్ అన్నారు. ఆదివారం మండలంలోని ముసునూరులోని బాలుర సంక్షేమ వసతి గృహంలోని పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందించారు. వచ్చే నెల మూడో తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.

శ్రీమహాలక్ష్మి ఆలయంలో భారీ అన్నదానం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

లక్కవరంలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. గ్రామసర్పంచి వెంకటరమణ, ఎంపిపి కొదమ జ్యోతితో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జెట్టి గురునాథరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇటీవల జరిగిన మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాల ముగింపు నేపథ్యంలో అన్నదానం నిర్వహించారు.

దేవాదాయశాఖ సేవా కార్యక్రమాలు వినియోగించుకోండి

ప్రజాశక్తి - భీమడోలు

దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్ కోరారు. ఆయన మండలంలో ఆదివారం పర్యటించారు. పోలసానిపల్లిలోని కాశీభొట్ల కృష్ణప్రసాద్‌శాస్త్రి నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీశోభాకృత్ నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. అనంతరం భీమడోలు గాయత్రీ బ్రాహ్మణ సేవా సమితి భవనాన్ని సందర్శించి, సమితి అభివృద్ధికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భీమడోలు బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు పార్వతీశ్వర శర్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అల్లూరి పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

'మన్య విప్లవం' పుస్తకావిష్కరణలో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజానాట్యమండలి రూపొందించిన మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు మన్యవిప్లవం పుస్తకాన్ని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడిన అల్లూరి పోరాట స్ఫూర్తిని ప్రజానాట్యమండలి కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళుతుందని, ప్రజానాట్యమండలి ఆవిర్భవించిన నాటి నుండి నేటి వరకూ బుర్రకథ, నాటకం, వీధి నాటిక, పాట వంటి ప్రక్రియలతో అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను వాడవాడలా ప్రచారం చేస్తుందని ఆయన తెలిపారు. ఇప్పటివరకూ అల్లూరి సీతారామరాజుపై ప్రజానాట్యమండలి రూపొందించినన్ని కళారూపాలు ఇతర ఏ కళా సంస్థ రూపొందించలేదని, ఈ ఘనత ప్రజానాట్యమండలికి మాత్రమే సాధ్యమని ఆయన అన్నారు. మన్య విప్లవం పుస్తకాన్ని ప్రజానాట్యమండలి రూపొందించడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు మాట్లాడుతూ నిరాయుధులైన గిరిజనులను సాయుధులుగా మలిచి అటవీ సంపదను దోపిడీ చేస్తున్న బ్రిటిష్ సామ్రాజ్యాన్ని తరిమికొట్టేందుకు పోరాటం చేసిన గొప్ప విప్లవకారుడు అల్లూరి అని కొనియాడారు. అల్లూరి నడయాడిన ప్రాంతాన్ని పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బుర్రకథ పితామహుడు షేక్ నాజర్ కుమారుడు బాబూజీ మాట్లాడుతూ కళాకారులు, కవుల చరిత్రలను తమ రచనల ద్వారా, కళారూపాల ద్వారా ప్రజలకు చేరవేసే వారధి వంటివారని ఆయన అన్నారు. అల్లూరి స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన జీవిత గాథల్ని వివిధ కళా ప్రక్రియల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లినప్పుడే ఆయనకు నివాళి అందించినట్లు అని తెలిపారు. సాహిత్య పరిశోధకులు లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అల్లూరి వంటి దేశభక్తుల చరిత్రలు వక్రీకరణలకు గురవుతున్నాయని, వాటినిలోతుగా పరిశోధించి చరిత్రను పున:నిర్మించాల్సిన అవసరం ఉందని, ఆ బాధ్యతను ప్రజానాట్యమండలి వంటి సంస్థలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా రచయితల సంఘం కార్యదర్శి నాగాస్త్ర అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రుద్రరాజు ఫౌండేషన్ అధ్యక్షులు ఆర్‌విఎస్.రాజు, ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, బహుజన్ నాయకులు దేవరకొండ వెంకటేశ్వర్లు, నంది అవార్డు గ్రహీత ఎమ్‌డి ఖాజావలి, హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం కార్యదర్శి పెదపాటి రామకృష్ణ, తెలుగు అధ్యాపకులు కొండా రవి, షేక్ ముస్తఫా అలీ ప్రసంగించారు.

ఈ సభలో అల్లూరి సీతారామరాజు 125వ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం స్మారక నాణేలను విడుదల చేయాలని, పాఠ్యపుస్తకాల్లో అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను పాఠ్యాంశంగా తిరిగి చేర్చాలని, పార్లమెంటులో అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు మాట్లాడుతూ అల్లూరి 125వ జయంతి, శత వర్ధంతి మన్య విప్లవం శతవార్షికోత్సవాలను పురస్కరించుకుని ప్రజానాట్యమండలి రాష్ట్రవ్యాప్త కళాజాతాను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు తెల్లం వంశీ, చరణ్, మణి త్రినాథ్‌రాజు, ఆర్‌వివి.రాజా, పుల్లాబొట్ల పురుషోత్తం, డి.రాములు, మేతర అజయ్ బాబు, ఎస్ఎన్.కట్ట, కూన కృష్ణారావు, టి.గిరిరాజ్ పాల్గొన్నారు.

మన్యవిప్లవం పుస్తకం ఆవిష్కరిస్తున్న సాబ్జీ

నేరాలు - ఘోరాలు

బోల్తాపడిన కారు

కారు బీభత్సం

ద్విచక్ర వాహనదారుణ్ని ఢీకొట్టి బడ్డీ కొట్టుపై బోల్తా

ఒకరు మృతి, నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మృతిచెందిన అప్పలనాయుడు

అతివేగంగా దూసుకొచ్చిన కారు బీభత్సం సృష్టించింది. అదుపుతప్పి ద్విచక్ర వాహనదారుణ్ని ఢీ కొట్టి అక్కడితో ఆగకుండా రోడ్డు పక్కన ఉన్న బడ్డీకొట్టు మీద బోల్తా పడింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో నలుగురికి గాయాలయ్యాయి. ఆదివారం స్థానిక బైపాస్ రోడ్ ఎస్ఆర్‌బంక్ సమీపంలో ముత్రాసులవారిపేట నుండి ద్విచక్ర వాహనంపై బైపాస్ రోడ్డు పైకి వస్తున్న కేతిరెడ్డి అప్పలనాయుడు(45)ని రాజమండ్రి వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా కారు అదుపు తప్పిన రోడ్డుకు అవతలి వైపు ఉన్న బడ్డీకొట్టు పైకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో అప్పలనాయుడు తలకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే రోడ్డుకు మరోవైపున బడ్డీకొట్టు నిర్వాహకులు పోలిన ప్రసాద్‌తో పాటు అక్కడే ఉన్న మరో ముగ్గురు కట్టా లక్ష్మీనారాయణ, తమ్మారెడ్డి రాజు, చిన్నా దుర్గారావుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికుల 108 వాహనంలో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అందించినప్పటికీ అప్పలనాయుడు పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మెరుగైన వైద్యం కోసం కట్టా లక్ష్మీనారాయణ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరుకు తరలించారు. మరో ఇద్దరు తమ్మారెడ్డి రాజు, చిన్నా దుర్గారావుకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పలనాయుడు మృతితో కార్మికులు దిగ్భ్రాంతి

కేతిరెడ్డి అప్పలనాయుడు మృతిపై స్థానిక భవన నిర్మాణ కార్మికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెలమపేటలో అనేక మంది కార్మికులకు ఉపాధి కల్పించడంలో అప్పలనాయుడు చొరవ తీసుకుని సహకారం అందిస్తున్నారని పలువురు తెలిపారు. ప్రమాద ఘటన తెలియగానే పట్టణ పరిసర ప్రాంతాల నుండి వందల సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు ఏరియా ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే 108కి సమచారం అందిస్తే కిలో మీటర్ దూరం చేరుకోవడానికి గంటకుపైగా సమయం పట్టిందని స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. ముందుగా 108 వాహనం చెరుకుని ఉంటే అప్పలనాయుడు ప్రాణాలు దక్కేవని పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

చిన్నపాటి గొడవ కారణంగా కూల్‌డ్రింక్‌లో పురుగుమందు కలుపుకుని తాగి నూతన దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం మండలంలోని లంకాలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రెండు నెలల క్రితం గ్రామానికి చెందిన తాటి వెంకటస్వామి(24), దివ్య(22) ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఎంతో అన్యోన్యంగా ఉండే వీరి ఆదివారం చిన్నపాటి గొడవజరిగింది. దీంతో ఇంట్లో ఉన్న పంటలో కలుపు నివారణకు వాడే పురుగుమందును కూల్‌డ్రింక్‌లో కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు గమనించి వెంటనే రాచన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గురవాయిగూడెం గ్రామ శివారులో కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. లక్కవరం ఎస్ఐ దుర్గామహేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం తమకు అందిన సమాచారం మేరకు కోడిపందేల స్థావరంపై దాడి చేశామని తెలిపారు. ఈ దాడిలో నలుగురిని అరెస్టు చేసి, రూ.3770 నగదు, పది ద్విచక్ర వాహనాలు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉగాది ఉత్సవాల్లో కొట్లాట

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉగాది జాతరలో ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ప్రదర్శనలో యువకులు రెండు గ్రూపులుగా కొట్లాడుకున్న ఘటనపై లక్కవరం పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. పోలీసుల వివరాలిలా ఉన్నాయి. లక్కవరం పుంతలో ముసలమ్మ గుడి దగ్గర ఉగాది వేడుకల్లో భాగంగా శనివారం రాత్రి డ్యాన్స్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. ప్రదర్శన జరుగుతున్న క్రమంలో యువకులు రెండు గ్రూపులుగా కొట్లాడుకున్నారు. దీంతో గాయాలపాలైన జీరి మధు, జీరి జగదీష్‌కు గాయాలు కాగా జగదీష్ ఫిర్యాదుతో ఎస్ఐ దుర్గా మహేశ్వరరావు కేసు నమోదు చేశారు. అలాగే మరో గ్రూపునకు చెందిన నిమ్మ సుబ్బారెడ్డి ఫిర్యాదుపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

జి.కొత్తపల్లి ఓరియంటల్ ఉన్నత పాఠశాల
ప్రధానోపాధ్యాయురాలు కెవివి.దుర్గ

చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

సెలువు రోజుల్లోనూ ఇద్దరు ఉపాధ్యాయులతో తరగతులు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

పదో తరగతి పరీక్షల్లో ప్రతీవిద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా శిక్షణ ఇస్తున్నట్లు జి.కొత్తపల్లి ఓరియంటల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కెవివి.దుర్గ తెలిపారు. ఈ మేరకు విద్యార్థులకు ప్రత్యేకంగా ఇస్తున్న శిక్షణ, నూరుశాతం ఉత్తీర్ణతకు తీసుకుంటున్న చర్యలను ప్రజాశక్తికి వివరించారు. తమ పాఠశాల నుండి ఈ విద్యాసంవత్సరం 35 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయబోతున్నారన్నారు. పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తూ ఉదయం 8.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. అలాగే వారి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నామని, ఆదివారం, ఇతర సెలవు రోజుల్లోనూ ఇద్దరు ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. చదువులో బాగా వెనుకబడిన విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా తేలికగా అర్థమయ్యే రీతిలో మెటీరియల్ తయారు చేసి చదివిస్తున్నామని, తల్లిదండ్రులకు కూడా ఎప్పటికప్పుడు పిల్లల చదువు, ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'విజయ కేతనం' కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. లఘు పరీక్షలు నిర్వహించి ఏ పరీక్షలో మార్కులు తక్కువగా వస్తున్నాయో గుర్తించి వారిని ఆ సబ్జెక్టులో రాణించేలా తర్ఫీదు ఇస్తున్నామని వివరించారు.

మహిళా సంక్షేమానికి వైసిపి కృషి : డిఎన్ఆర్

ప్రజాశక్తి - ముదినేపల్లి

మహిళల సంక్షేమమే వైసిపి ధ్యేయమని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. ముదినేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం జరిగిన ఆసరా మూడో విడత కార్యక్రమంలో ఎంఎల్ఎ మట్లాడుతూ మండలంలోని అక్క చెల్లెమ్మలకు ఆసరాగా మూడో విడత రూ.11కోట్ల77లక్షల 72,500 లబ్ధి చేకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, తహశీల్దార్ కె.శ్రీనివాస్, ఎంపిడిఒ పి.మల్లీశ్వరి, వైస్‌ఎంపిపిలు సునీత, రాధా, పార్టీ మండల అధ్యక్షులు ఎం.ఏసుబాబు, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



మహిళలకు నమూనా చెక్కును అందిస్తున్న ఎంఎల్ఎ నాగేశ్వరరావు

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు నియోజకవర్గంలో సిఎం జగన్ పర్యటన సందర్భంగా పలువురు రోగులు సిఎం రిలీఫ్ ఫండ్ కోరుతూ వినతులను అందజేశారు. వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున చెక్కులను వారికి పంపిణీ చేశారు. రాయన్నపాలేనికి చెందిన వై.మోషేరాజు కిడ్నీల వ్యాధితో బాధపడుతున్నానని, తనను ఆదుకోవాలని సిఎంను కోరారు. సిఎం ఆదేశాల మేరకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్య చౌదరి, పుప్పాల వాసుబాబు, తలారి వెంకటరావు, జెసి అరుణ్‌బాబు తక్షణ వైద్య ఖర్చుల నిమిత్తం మోషేరాజు కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. తన కుమార్తె కె.సెఫిల్ అనోరెక్టల్ మాల్ ఫార్మేషన్‌తో బాధపడుతున్నట్లు దెందులూరు గ్రామానికి చెందిన కొంగర ప్రిస్కిల్లాతో పాటు తన కుమార్తె భవ్యశ్రీ మల్లిక(10 నెలలు) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోందని, పోస్ట్ ఆపరేషన్ వైద్య చికిత్సకు మందులు అందించాలని కొవ్వలి గ్రామానికి చెందిన జె.హేమలత, దెందులూరు గ్రామానికి చెందిన బర్నాన క్రాంతి ప్రసాద్(31) బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. అదేవిధంగా పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామానికి చెందిన పెనుబోయిన కృపారావు(39) తన రెండు కిడ్నీలు పాడయ్యాయని, వైద్యానికి రూ.ఐదు లక్షల నుంచి రూ.ఆరు లక్షలు ఖర్చవుతుందని, తనకు ఆర్థిక సాయం చేయాలని సిఎంను కోరారు. తాను శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్నానని, మంచంపై నుండి కదలలేని పరిస్థితులో ఉన్నానని, తనకు పింఛన్ మంజూరు చేయాలని దెందులూరుకు చెందిన ఈడుపల్లి ప్రసాద్ కోరారు. వీరందరికీ దెందులూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చెక్కులు పంపిణీ చేశారు.



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందిస్తున్న, ఎంఎల్ఎలు, కలెక్టర్

భీమడోలు గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు శాఖా గ్రంథాలయం ప్రతీ ఆదివారం నిర్వహిస్తున్న చదవడం మాకు ఇష్టం కార్యక్రమం పట్ల విద్యార్థులు ఆసక్తి కనపర్చుతున్నారని గ్రంథపాలకులు కె.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యావేత్త, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు టివి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తాము చదివిన పుస్తకాలపై వారితో ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సత్యం ఫౌండేషన్ ఛైర్మన్ బాలనాగు విజయసారధి పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడు పుట్టినరోజు సందర్భంగా అన్నదానం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు పుట్టినరోజు వేడుకను స్థానిక టిడిపి నేతలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అమ్మ ప్రేమ ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థలో చిన్నారుల మధ్య నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి భోజనాలు ఏర్పాటు చేశారు. గురవాయిగూడెం టిడిపి కార్యాలయంలో కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్‌చంద్రశేషు మాట్లాడుతూ కింజరాపు కుటుంబం టిడిపికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు సాయల సత్యనారాయణ, సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబొమ్మ రామలింగేశ్వరరావు, చింతలపూడి నియోజకవర్గ మహిళా కన్వీనర్ చిలపరెడ్డి ఇంద్రాణి, తెలుగు యువత అధికార ప్రతినిధి ఘంటా శ్రీను, అందుగుల శ్యామ్, ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు శ్రీను పాల్గొన్నారు.

క్షయ నియంత్రణలో ఏలూరు జిల్లా టాప్

ప్రజాశక్తి - ఏలూరు

క్షయ(టీబీ) వ్యాధి నియంత్రణలో ఏలూరు జిల్లా రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉంది. ఆ తర్వాత విశాఖపట్నం, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలు ఉన్నాయి. దీంతో కేంద్రప్రభుత్వం ఏలూరు జిల్లాకు బంగారు, విశాఖపట్నం, అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు వెండి, మరో ఐదు జిల్లాలకు కాంస్య పతకాలను ప్రకటించింది. టీబీ నియంత్రణలో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు ఈ జాతీయ అవార్డులు అందజేశారు. క్షయ రహిత దిశగా పురోగతి సాధించినందుకు ఆంధ్రప్రదేశ్ మూడు జాతీయ అవార్డులను గెలుచుకుంది. ప్రపంచ టీబీ నియంత్రణ దినోత్సవం సందర్భంగా వారణాసిలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నిర్వహించిన వన్ వరల్డ్ టీబీ సమ్మిట్‌లో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్, సంబంధిత ఇతర అధికారులు ఈ అవార్డులను అందుకున్నారు. ఈ సదస్సుకు ప్రధాని మోడీ హాజరయ్యారు. టీబీ రహిత స్థితిని సాధించడంలో ప్రయత్నాలను అంచనా వేయడానికి దేశవ్యాప్తంగా సబ్ నేషనల్ సర్టిఫికేషన్ (ఎస్ఎన్‌సి) నిర్వహించిన అంచనాల మేరకు రాష్ట్రంలోని మూడు జిల్లాలు బంగారు, వెండి పతకాలను గెలుచుకున్నాయి.

అలాగే శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాలకు కాంస్య పురస్కారాలు లభించాయి. ఈ జిల్లాలు 2015-2022 మధ్య టీబీ సంభవనీయతను తగ్గించడంలో ఉత్తమ పనితీరుకు గాను అవార్డు పొందాయి. సెంట్రల్ ట్యూబర్ క్యులోసిస్ (ఎస్ఎన్‌సి) డివిజన్, చెన్నైలోని ట్యూబర్‌క్యులోసిస్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ పర్యవేక్షణలో వివిధ పద్ధతుల్లో మూల్యాంకనం నిర్వహించారు. అసెస్‌మెంట్‌లో భాగంగా డిసెంబర్ 2022, జనవరి 2023లో కమ్యూనిటీ సర్వే నిర్వహించారు. ఈ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 2,49,208 కుటుంబాల నుండి 6,30,474 మంది వ్యక్తులను పరీక్షించగా 2022లో 92,177 తాజా టీబీ కేసులు నిర్ధారణయ్యాయి. ఏలూరు జిల్లాలో 10 వేల కుటుంబాల నుండి 24,207 మంది వ్యక్తులను పరీక్షించగా 242 కఫం పరీక్షలు చేశారు. దేశంలో మొత్తం 337 జిల్లాల్లో అసెస్ చేయగా వాటిలో 18 స్వర్ణం, 28 రజతం, 65 కాంస్య పతకాలను గెలుచుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి జి.రత్నకుమారి, సంబంధిత వైద్యాధికారులను, సిబ్బందిని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అభినందించారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, గొల్లవానితిప్ప, లొసరి గూట్లపాడు గ్రామ కాపురస్తులు గద్దం శాంతకుమారి, తండ్రి: మైలా ఏసుపాదం, భర్త: గద్దం ఏసుపాదం, అనే నేను తెలియ చేయునది ఏమనగా.., ది. 14-03-2023వ తేదిన పాస్ పోర్టు పని నిమిత్తం గొల్లవానితిప్ప నుండి భీమవరం వెళ్తుండగా మార్గం మధ్యలో నా **ఒరిజినల్ పాస్‌పోర్టు నెం. K7849413 పడిపోయినది.** చుట్టుప్రక్కల ఎంత వెదికినను దొరకలేదు. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది చిరునామాకు అందజేయగలరు.

గద్దం శాంతకుమారి
తండ్రి: మైలా ఏసుపాదం,
భర్త: గద్దం ఏసుపాదం, గొల్లవానితిప్ప,
లొసరి గూట్లపాడు, భీమవరం మండలం,
ప.గో.జిల్లా. సెల్ నెం: 99083 91128

In The Court Of The 1st Additional Junior Civil Judge :: Tanuku
O.S.No. 557/2022

Between:
Bandaru Dhana Raju ***...Plaintiff***
AND
Perisetti Dhana Lakshmi and another ***...Defendant***

To: Defendant:
1) Perisetti Dhana Lakshmi, W/o. Bhaskara Rao, Hindu, Female, Age 53 Years, R/o. D.No. 11-158, Near Veerabhadra Swamy Temple, Velpuru, Tanuku Mandal, W.G.Dist.
2) Perisetti Bhanu Durga Prasad, S/o. Bhaskara Rao, Hindu, Male, Age 30 Years, R/o. D.No. 11-158, Near Veerabhadra Swamy Temple, Velpuru, Tanuku Mandal, W.G.Dist.

Please take notice that the above suit filed by the plaintiff ageinst you stands posted to 18-04-2023 for your appearance in person or through yout counsel **at 10:30 A.M. on 18-04-2023 before the above Hon'bel Court.** Failing which the matter shall be decided by the Hon'ble Court in your absence as per law.

//By Order of The Hon'ble Court//
B.VENKAT, Advocate,
Tanuku. Cell: 70131 23186

తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం. 45/2022
ఓ.ఎస్.నెం. 49/2021

మధ్య:
గాది నరసింహారావు, S/o. రామారావు, మేల్, వయస్సు 39, వ్యాపారం, R/o. డో.నెం.9-12-12/2, ఎగ్గినవారి వీధి, సవిత్రుపేట, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా.
...డిక్రీ హోల్డర్ /డి. హెచ్.ఆర్
VS
కాకులపాటి వరప్రసాద్, S/o. జోసఫ్, మేల్, ఎంప్లాయి, R/o. డో.నెం. 7-12-14, పాతూరు, 12వ వార్డు, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా.
...జడ్జిమెంటు డెటార్ /జె.డి.ఆర్

డి.హెచ్.ఆర్. తరపు దాఖలు చేసిన పత్రికా ప్రకటన

పై తెల్పిన ఇ.పి.నెం. 45/2022లో జె.డి.ఆర్. అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా Order 21 Rule 54 నోటీసు పలుమార్లు పంపినా జె.డి.ఆర్. ఉద్దేశ్యపూర్వకంగా నోటీసులు తీసుకోనందున సబ్‌సిట్యూట్ సర్వీసు ద్వారా అనగా ఈ పత్రికా ప్రకటన ద్వారా పై కోర్టు వారు తెలియజేయమని ఉత్తర్వులు జారీ చేసిన మీదట మీరు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ **పై కోర్టు వారి ఎదుట ది.13-04-2023వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు హాజరు అయ్యి సదరు పై తెల్పిన ఇ.పి.నెం. 45/2022లో సమాధానం తెల్పవలెను.** లేని ఎడల పై కోర్టు వారు మీ పై పరోక్షముగా తీర్మానం చేయుదురు అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు.., **శిరిగినీడి విజయకృష్ణ**
అడ్వకట్ & నోటరీ,
తాడేపల్లిగూడెం, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్,
26-3-2023. తాడేపల్లిగూడెం.